APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

గురువారం 12-06- 2025

సంపుటి : 16 | సంచిక : 201 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 4 | వెల : రూ. 4 epaper.expresstelugudaily.com

## సర్కార్ బడుల్లోనూ కెజీ చదువులు

■ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేట్ తరహాలో ఎల్‌కేజి చదువులు అందుబాటులోకి రానున్నాయి. వాటికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే క్రమంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి చదువుకునే అవకాశం ఉండగా... ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నడుస్తున్నాయి. పిల్లలకు మూడేళ్లు నిండగానే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మిగతా 2లో..

## కాళేశ్వరంపై అసలు విషయాలు
# బయట పెడతా



### తాను ఉన్నంతవరకు కాంగ్రెస్‌లోకి కెసిఆర్‌ను రానివ్వను

తెలంగాణకు ప్రథమ శతృవు కెసిఆర్ కుటుంబమే

తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ప్రధాన అడ్డంకి

హైదరాబాద్‌కు వచ్చాక మంత్రులకు శాఖల కేటాయింపు

మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. దిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపుపై దిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని సీఎం చెప్పారు. హైదరాబాద్ వచ్చాక అందరితో సంప్రదించి శాఖలు నిర్ణయిస్తామని తెలిపారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద మిగతా 2లో..

### ముగ్గురు కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

వివేక్‌కు కార్మిక, మైనింగ్ శాఖలు

అడ్లూరికి సంక్షేమం... శ్రీహరికి క్రీడలు, యువజనం

వాకాటి శ్రీహరికి పశుసంవర్థక, క్రీడలు, యువజన శాఖలు

2లో

## 50 నిమిషాల.. 18 ప్రశ్నలు..

### కేబినేట్ నిర్ణయం మేరకే కాళేశ్వరం

వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం

త్వరగా నిర్మించేందుకు కమిషన్ ఏర్పాటు

వ్యాప్కోస్ సూచన మేరకు స్థల మార్పు

ప్రాజెక్టుపై అన్ని అంశాలతో కూడిన బుక్ అందచేత

50 నిముషాల పాటు కెసిఆర్‌ను విచారించిన కమిషన్

ఓపెన్ కోర్టు కాకుండా ఇండోర్‌లో విచారణ

కమిషన్ ముందు సుదీర్ఘంగా వివరణ ఇచ్చిన కెసిఆర్



**హైదరాబాద్,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే కాళేశ్వరం ఆనకట్టల నిర్మాణం జరిగిందని మాజీ కేసీఆర్ జస్టిస్ ఘోస్ కమిషన్ ముందు స్పష్టం చేశారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే స్థల మార్పు చేసి, మిగతా 2లో..

### మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి

రిసార్టులో పార్టీపై ఎస్‌వోటి పోలీసుల దాడి

గాయని మంగ్లీపై కేసు నమోదు



2లో



## కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ
# పెద్ద స్కాములు

ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థ బలోపేతం

కమిషన్ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు

ఎంతటి వారున్నా వదిలేది లేదన్న మంత్రి పొంగులేటి

**ములుగు,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గత భారాస ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.ప్రాజెక్టుల పేరుతో పింక్ వ్యవస్థను బలోపేతం మిగతా 2లో..

### కాళేశ్వరం నిర్మాణమే బ్లండర్

దాంతో వరి దిగుబడులు పెరగడం అబద్ధం

కాళేశ్వరం గొప్పలు చెప్పిన కెసిఆర్ అందుకు బాధ్యులు

చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు మిగతా 2లో..

## కాళేశ్వరంతో కరువును
# తరిమిన నేత



### తెలంగాణ దాహాన్ని తీర్చిన దార్శనికుడు

చరిత్రలో కెసిఆర్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడింది

కెసిఆర్‌ను దార్శనికతను అర్థం చేసుకోవడం కాంగ్రెస్‌కు అసాధ్యం

విచారణల పేరుతో రేవంత్ రెడ్డి కెసిఆర్ వెంట్రుక కూడా పీకలేడు

మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

2లో

### ఏడాదిగా వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం

ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం

కూటమిలో జనసేనది కీలక భూమిక: నాదెండ్ల



2లో

## పరిశ్రమలు రాకుండా మోకాలడ్డుతున్న బిఆర్ఎస్

■ గద్వాలలో ఇథనాల్ ఫ్యాక్టరీని అడ్డుకోవడం దుర్మార్గం

■ అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవు: శ్రీధర్ బాబు

**హైదరాబాద్,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు కాకుండా భారాస కుట్రలు చేస్తోందని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు దొరక్కుండా చేయాలన్నదే వారి దుర్మార్గపు ఆలోచన అని మండిపడ్డారు. గద్వాలలో ఇథనాల్ కంపెనీని మిగతా 2లో..



### యూపిఐ లావాదేవీలపై సర్‌ఛార్జీ విధించం

ఛార్జీలు విధిస్తున్నారంటూ మీడియాకథనాలు

తోసిపుచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ



2లో

## సూపర్ సిక్స్ హామీల్లో మరో పథకం

నేటినుంచి తల్లికి వందనం అమలుకు శ్రీకారం

67 లక్షల మందికి తల్లికి వందనం కింద నగదు జమ

సిఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తల్లులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో ముఖ్యమైన పథకం అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా గురువారం తల్లులకు కానుకగా తల్లికి మిగతా 2లో..




## దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

### పొదిలి ఘటనపై మంత్రి లోకేశ్ హెచ్చరిక

**అమరావతి,స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మిగతా 2లో..



### ఆకట్టుకున్న వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగా

కృష్ణా తీరంలో ఉత్సాహంగా సాగిన ప్రదర్శనలు

వాటర్ క్రాఫ్టులపై వేయిమంది యోగాసనాలు

కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి కేశినేని చిన్ని

2లో

# కాళేశ్వరంపై అసలు విషయాలు బయట పెడతా

(మొదటి పేజీ తరువాయి)
చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం డాక్యుమెంట్లు అన్నింటినీ బయటపెడతానన్నారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు. కొత్త మంత్రులపై శాఖల కేటాయింపుపై సీఎం స్పష్టత ఇచ్చారు. తన దగ్గర ఉన్న శాఖలను కొత్త మంత్రులకు ఇస్తానని చెప్పారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో కొన్ని నెలల వరకు మంత్రి పదవులు ఇవ్వలేదని, ఇచ్చినప్పటికీ శాఖలను కేటాయించలేదన్నారు. తాను మాత్రం రెండు మూడు రోజులకే శాఖలను కేటాయించినట్లు చెప్పారు. అలాగే కేసీఆర్ కుటుంబంపై సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు కేసీఆర్ కుటుంబ సభ్యులే శత్రువులని, తాను ఉన్నంత వరకు కేసీఆర్ ఫ్యామిలీకి కాంగ్రెస్‌లోకి ఎంట్రీ లేదని స్పష్టం చేశారు. కులగణన సమయంలో కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్, కిషన్ రెడ్డి అందరి నివాసాలకు ప్రత్యేకంగా వెళ్లి వివరాలు స్వీకరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రత్యేకంగా సూచించినట్లు– తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, కిషన్ రెడ్డి, హరీష్ రావు సర్వేలో వివరాలు పంచుకోలేదన్నారు. కాళేశ్వరంలో ఏం జరిగింది, కాళేశ్వరంపై తనకు ఉన్న అభిప్రాయాలను రెండు మూడు రోజుల్లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కూడా ముఖ్యమంత్రి విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి అడ్డుపడుతుంది కిషన్ రెడ్డే అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ఒక ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డి ముందుకు వస్తే వారితో కలిసి వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.



తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డితో సమీక్ష చేసేందుకు రెడీగా ఉన్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఏ రోజైనా తెలంగాణ ప్రాజెక్టులపై కిషన్ రెడ్డి నివేదిక ఇచ్చారా కనీసం తెలంగాణకు ప్రాజెక్టు ఇవ్వాలని డిమాండ్ చేశారా అని ప్రశ్నించారు. కేంద్ర కేబినెట్‌లో తెలంగాణ అంశాలను ఎప్పుడైనా కేంద్రమంత్రి ప్రస్తావించారా అంటూ నిలదీశారు. నిర్మల సీతారామన్ చెన్నైకు మెట్రో తీసుకువెళ్లారని.. ప్రహ్లాద్ కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారని.. తెలంగాణ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఏమీ తీసుకురాలేదని మండిపడ్డారు. తెలంగాణలో ప్రతీ అభివృద్ధి కార్యక్రమానికి కిషన్ రెడ్డి అడ్డుగా ఉన్నారన్నారు. తెలంగాణ మంత్రివర్గం విస్తరణలో సామాజిక న్యాయం పాటించామని.. 55 శాతం మేరకు ఇప్పటికే పదవులు కేయించామన్నారు. నక్సలిజానికి అంతం ఉండదని.. సామాజిక అసమానతలు ఉన్నంత వరకు నక్సలిజం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ముగ్గురు కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో కొత్త మంత్రులకు శాఖల కేటాయించారు. ఇటీవల ప్రమాణం చేసిన ముగ్గురు మంత్రులకు శాఖలుకేటాయించారు. సిఎం రేవంత్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న తరవాత ఈ కేటాయింపు జరిగింది. గడ్డం వివేక్‌కు కార్మిక,మైనింగ్ శాఖలు.. అలాగే వాకాటి శ్రీహరికి పశుసంవర్ధక, క్రీడలు, యువజన శాఖలు, అడ్లూరు లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుందని సమాచారం. ఈ ఉత్తర్వులు జారీ చేసే ముందు సీఎం రేవంత్ రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రుల శాఖ కేటాయింపుపై వీరిద్దరు చర్చించినట్లు– తెలుస్తోంది. ఒక్కో మంత్రికి రెండేసి శాఖలు చొప్పున కేటాయించాలనే ప్రతిపాదనను సీఎస్‌కు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసినట్లు– సమాచారం. జూన్ 8వ తేదీ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి.. తన కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లోకి కొత్తగా ముగ్గురు ఎమ్మెల్యేలు గడ్డం వివేక్ (చెన్నూరు), వాకాటి శ్రీహరి (మక్తల్), అడ్లూరి లక్ష్మణ్ (ధర్మపురి) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే వారికి శాఖలు కేటాయించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రులకు శాఖ కేటాయింపుపై పార్టీ అధిష్టానంతో చర్చించారు.

# 50 నిమిషాల.. 18 ప్రశ్నలు..

(మొదటి పేజీ తరువాయి)
నిర్మాణం జరిగిందని.. అందుకు అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. బీఆర్కే భవన్‌లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్‌రావు ఉన్నారు.విచారణ సందర్భంగా కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈక్రమంలో కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కేసీఆర్ వివరించారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు– కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు– వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్‌ను కమిషన్ అడిగింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో నంబర్ 45ను, ఆపరేషన్స్



అండ్ మెయింటెనెన్స్ బుక్‌ను కమిషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్‌కు కేసీఆర్ పలు డాక్యుమెంట్లను అందించారు. మొదట దైవసాక్షిగా వాస్తవాలు చెబుతానని కేసీఆర్ చేత ప్రమాణం చేయించిన కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్. మొత్తం 18 ప్రశ్నలను ఘోష్ అడిగారు. రీ ఇంజనీరింగ్, కార్పొరేషన్ ఏర్పాటు–, కేబినెట్ ఆమోదంపై కమిషన్ ప్రశ్నలు వేసింది. రీ ఇంజనీరింగ్ చేయడానికి ప్రధాన కారణాలను కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. ప్రతిదీ కేబినెట్ ఆమోదంతో జరిగిందని కేసీఆర్ వివరణ ఇచ్చారు. కేబినెట్ ఆమోదంతోనే ప్రభుత్వం అన్ని నిర్ణయాలు తీసుకుందన్నారు. స్థల మార్పు నీటి లభ్యత, కాళేశ్వరం నిర్మాణంపై వ్యాప్కోస్ నివేదిక ఇచ్చిందని కమిషన్‌కు చెప్పారు. లైఫ్ లైన్ కాళేశ్వరం పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. అందులో కాళేశ్వరం ఉద్దేశ్యాలను వివరించారు. నిధుల సమీకరణ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని.. బ్యారేజీల్లో నీటి నిలువ అనేది ఇంజనీర్లు తీసుకునే నిర్ణయం తనకు సంబంధం లేదని కేసీఆర్ వెల్లడించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ కోసం మీరేమైనా ఆదేశాలు ఇచ్చారా అని కమిషన్ ప్రశ్నించగా... తాను అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని.. బ్యారేజీలు నీటిని ఎత్తిపోయడానికి నిర్మించినవి అని కేసీఆర్ సమాధానమిచ్చారు. ప్రాజెక్ట్ లొకేషన్ మార్పు నిర్ణయం ఎవరిది అంటూ కమిషన్ మరో ప్రశ్న సంధించింది. లొకేషన్ ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేసీఆర్ సుదీర్ఘంగా వివరించారు. సీడబ్ల్యూసీ తుమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పిందని.. వ్యాప్కోస్ సర్వే చేసి నివేదిక ఇచ్చిందన్నారు. టెక్నికల్ టీమ్ మూడు బ్యారేజీలు నిర్మించాలని చెప్పిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదని చెప్పారు. టెక్నికల్ టీమ్ ఇచ్చిన నివేదిక మేరకు లొకేషన్ మార్పు జరిగిందన్నారు. నిర్ణయాలన్నీ కేబినెట్ ఆమోదంతోనే జరిగాయని కేసీఆర్ చెప్పారు. విచారణ ముగిసిన తర్వాత బీఆర్కే భవన్ ముందు కార్యకర్తలకు కెసిఆర్ అభివాదం చేశారు. అనంతరం అక్కడ నుంచి కేసీఆర్ వెళ్లిపోయారు. కాగా.. కాళేశ్వరం విచారణలో భాగంగా బుధవారం సిద్ధిపేటలోని ఫాంహౌస్ నుంచి హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌కు కేసీఆర్ చేరుకున్నారు. విచారణ నిమిత్తం లోపలికి వెళ్లిన కేసీఆర్ తనకు జలుబు ఉందని కమిషన్‌కు చెప్పారు. ఈ క్రమంలో విచారణ విషయంలో కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్ ఓపెన్ కోర్టు విచారణను రద్దు చేసింది. కేసీఆర్ అనారోగ్యం కారణంగా బహిరంగ విచారణను రద్దు చేసిన కమిషన్.. ఇండోర్‌లో ముఖాముఖిగా మాజీ సీఎంను విచారించారు. ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్‌రావు ఉన్నారు.

# పరిశ్రమలు రాకుండా మోకాలడ్డుతున్న బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)
అడ్డుకోవడం వెనక బిఆర్ఎస్ ఉందన్నారు. 2025–26 నాటికి పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో కేంద్రం నిర్ణయం మేరకే ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటవుతోంది. భూములను పరిశ్రమ యాజమాన్యమే కొనుగోలు చేసింది. నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభమైతే యువతకు ఉద్యోగాలు వచ్చి ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. భారాస మాత్రం రాజకీయ ఎజెండాతో ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుంటోంది. గత ఓటమి నుంచి భారాస గుణపాఠం నేర్చుకుని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని శ్రీధర్‌బాబు అన్నారు. ఇకపోతే ఏడాదిన్నరలో రాష్ట్రానికి రూ. 3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ప్రైవేటు రంగంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించాం. పరోక్షంగా మరో లక్ష మంది ప్రయోజనం పొందుతున్నారు. పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని భారాస కలవరపడుతోంది. పరిశ్రమల ఏర్పాటు–కు ఆటంకాలు సృష్టిస్తూ భారాస నేతలు రైతులను రెచ్చగొడుతున్నారు. అరాచకం సృష్టించాలని చూస్తే ప్రభుత్వ యంత్రాంగం చూస్తూ ఊరుకోదని మంత్రి శ్రీధర్ బాబు ఘాటుగా హెచ్చరించారు. యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తే వారే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

## కాళేశ్వరం నిర్మాణమే బ్లండర్

(మొదటి పేజీ తరువాయి)
చేశారని బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం మంచి అయినా, చెడు అయిన బాధ్యుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ఒకప్పుడు మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు తప్పించుకుంటున్నారని విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి దాన్యం దిగుబడి పెరగలేదని, ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ బ్లండర్ కాళేశ్వరం అని, కాళేశ్వరంలో అవినీతి జరిగినా ప్రాజెక్ట్ కూడా మిగలలేదని ఎద్దేవా చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు కాళేశ్వరం కూడా ఓ కారణం అని కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి దాన్యం దిగుబడి పెరగలేదు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్ అన్ని విధాలుగా తప్పు. మేడిగడ్డను బ్యారేజ్‌గా కాకుండా.. డ్యాంగా వాడుకోవడం వల్లనే దెబ్బతింది. అప్పుడు కాళేశ్వరంపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు కేసీఆర్ తప్పించుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్వయం ప్రత్యక్షం అయిందా?. గవర్నర్ కేసీఆర్ గారిని కాళేశ్వర్ రావు అని పిలిచారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతి రైతు ప్రతి ఏడాది 91 వేలు రూపాయలు లబ్ధి పొందుతున్నారు. బీజేపీ ఎంపీలు వేస్ట్ అని ఆరోపిస్తున్నారు. తెలంగాణను ఆదుకుంటుంది కేంద్రం.

## మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి

**రంగారెడ్డి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి లభ్యమయ్యాయి. పుట్టినరోజు సందర్భంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఈర్లపల్లి శివారులోని రిసార్టులో స్నేహితులకు మంగళవారం రాత్రి ఆమె పార్టీ ఇచ్చారు. ఈ వేడుకలకు సుమారు 50 మంది వరకు మంగ్లీ కుటుంబ సభ్యులు, స్నేహితులు హాజరయ్యారు. వీరిలో సినీ పరిశ్రమకు చెందిన వారు కూడా ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలో రాత్రి 2 గంటల సమయంలో ఎస్‌వోటీ పోలీసులు రిసార్టుపై దాడులు చేశారు. పార్టీకి వచ్చిన వారిలో 48 మందికి గంజాయి పరీక్షలు నిర్వహించగా 9 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో సింగర్ మంగ్లీపై కేసు నమోదు అయింది. అనుమతి లేకుండా బర్త్‌డే పార్టీ నిర్వహించిన కారణంతో పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. మంగ్లీ తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రాత్రి చేవెళ్ల త్రిపుర రిసార్ట్‌లో తన స్నేహితులకు పార్టీ ఇచ్చారు.

## యూపిఐ లావాదేవీలపై సర్‌ఛార్జీ విధించం

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** యూపీఐ లావాదేవీల పై ఎటువంటి ఛార్జీలు విధించబోమని కేంద్రం తెలిపింది. ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తున్నట్లు– ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై కేంద్రం స్పందించింది. అవన్నీ ఊహాగానాలే అంటూ కొట్టి పారేసింది. అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయంటూ పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో వీటికి సహకరించాలనే లక్ష్యంతో ఎండీఆర్ ఛార్జీలను విధించాలని కేంద్రం భావిస్తోందంటూ వార్తలు వచ్చాయి. వ్యాపారుల వార్షిక ఆదాయం ఆధారంగా కాకుండా, లావాదేవీ విలువ ఆధారంగా ఎండీఆర్ విధించేందుకు చర్చలు జరుగుతున్నాయని, యూపీఐ ద్వారా రూ. 3,000కు పైబడిన లావాదేవీలపై ఈ ఛార్జీలు విధించే యోచనలో కేంద్రం ఉందనేది ఆ వార్తల సారాంశం.

## కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పెద్ద స్కామ్‌లు

(మొదటి పేజీ తరువాయి)
చేసుకున్నారని ధ్వజమెత్తారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని, ఎంతటి వారైనా తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగులో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర కమిషన్ రిపోర్ట్ వచ్చాక చట్టపరమైన చర్యలు తప్పవని, ఎంత పెద్దవాళ్లు ఉన్నా వదలబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. కాళేశ్వరం విచారణలో ఎలాంటి రాజకీయ కక్ష వేధింపులు ఉండవని స్పష్టం చేశారు. కమిషన్ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగానే.. అందులో ఎవరి పాత్ర ఉంటే వారిపైనే చర్యలు ఉంటాయన్నారు. జాతిపితగా ప్రకటించుకునే వ్యక్తి దర్యాప్తు సంస్థ ముందు విచారణకు వచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, ధరణి, మిషన్ భగీరథ పథకాలు పెద్ద స్కామ్ అని పొంగులేటి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు అంశాల్లో దోచుకోవడం పెట్టుకున్నారు. కాళేశ్వరాన్ని ఎనిమిదవ వింతగా చూపించారు. గొప్ప ప్రాజెక్టుగా చెప్పిన కాళేశ్వరం వాళ్లున్న (బీఆర్ఎస్) సమయంలోనే కూలిపోయింది. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కాళేశ్వరంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాపాడే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేసారు. రాష్ట్ర సంస్థలతో విచారణ జరిపితే పొలిటికల్, తప్పుడు ప్రచారాలు జరుగుతాయని కేంద్ర సంస్థతో విచారణ చేపట్టారు. కాళేశ్వరం నిర్మాణంలో ఉన్న లోపాలు బయటపడ్డాయి. ప్రాజెక్టు పేరుతో పింక్ కలర్ కుట్రని ఛేదించేందుకు కమిషన్‌ని నియమించింది. కేంద్ర సంస్థ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా జడ్జితో కమిషన్ వేసి పూర్తి వివరాలు తెలుసుకుంటూ ఉంటే.. దాన్ని తప్పు పట్టే ప్రయత్నం చేస్తున్నారు.

# సూపర్ సిక్స్ హామీల్లో మరో పథకం

(మొదటి పేజీ తరువాయి)
వందనం నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. జూన్ 12న తల్లికి వందనం నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం కింద వారివారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తామన్న మేనిఫెస్టో హామీ మేరకు పథకం అమలుకు నిర్ణయం తీసుకుంది. తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. ఈ మేరకు 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం వర్తించనుంది. తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ. 8,745 కోట్లను కూటమి ప్రభుత్వం జమ చేయనుంది. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం అర్ధరాత్రి నుంచే



నిధులు విడుదల కానున్నాయి. 1వ తరగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులకూ తల్లికి వందనం పథకం అమలు కానుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా తల్లులకు కానుకగా తల్లికి వందనం ఇవ్వనుంది ప్రభుత్వం.. ఈ మేరకు సీఎం చంద్రబాబు.. తల్లికి వందనంపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 67 లక్షల మందికి తల్లికి వందనం పథకం నిధులు వారి ఖాతాల్లో జమ చేయనుంది. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నారు.. విధి విధానాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం.. కాగా, సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం–2 పథకాలు అమలు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు తల్లికి వందనం అమలుపై నిర్ణయం తీసుకుంది.

## ఆకట్టుకున్న వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగా

**విజయవాడ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తొలి జాము నుంచి చిరు జల్లులు సవ్వడి చేస్తూ కృష్ణా తీరం ఆహ్లాదకర వాతావరణం సంతరించుకుంది. నగరంలోని బెరం పార్కు వద్ద కృష్ణమ్మ తీరం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నేతృత్వంలో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ – ఫ్లోటింగ్ యోగా మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు యోగా ప్రియులు విశేషంగా తరలిరావడంతో పులకించింది. బుధవారం ఉదయాన్నే బెరం పార్కుకు చేరుకున్న పార్లమెంటు– సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలకు యోగా ప్రియులు హర్షధ్వానాలతో స్వాగతంపలికారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన యోగా ఔత్సాహికులు పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు– వంటి 201 వాటర్ క్రాఫ్టులపై వెయ్యిమంది, నదీ తీర ప్రాంతంలో ఏర్పాటు– చేసిన పచ్చని తివాచీలపై మరో వెయ్యి మంది యోగాసనాలు ఆచరించడంతో కృష్ణమ్మ ఒడి పులకించింది. ప్రపంచ రికార్డు సాధించాలన్న జిల్లా యంత్రాంగం ఆశయం నెరవేరింది.

## కాళేశ్వరంతో కరువును తరిమిన నేత

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాష్ట్రం కరువుకు, దాహానికి శాశ్వత పరిష్కారం చూపించారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కేసీఆర్ బలం, జీవన దృక్పోణాన్ని అర్థం చేసుకోవడానికి జోకర్ కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం కూడా చాలదు. అల్ప మనస్తత్వం ఉన్న కాంగ్రెస్ నాయకులు వందజన్మలు ఎత్తినా కూడా కేసీఆర్ సాధించిన విజయాల్లో పదవంతైనా సాధించలేరు అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. కెసిఆర్ కాళేశ్వరం విచారణకు హాజరయిన సందర్భంగా, బీఆర్‌కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతది అని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుంది అని కొనియాడారు. గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని అనేక కార్యక్రమాలను కేసీఆర్ విజయవంతంగా సాధించారు. ప్రజాస్వామ్య పోరాటంతో, తెలంగాణ ఆర్తితో తెలంగాణ కోసం, కేవలం తెలంగాణ కోసమే కేసీఆర్ పనిచేశారు. ఉద్యమం ద్వారా కోట్లాది మందికి స్వరాష్ట్ర ఆశయాన్ని అందించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకర మైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం.. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుందని ఘాటు విమర్శలు చేశారు. వంద జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## సర్కార్ బడుల్లోనూ కెజీ చదువులు

(మొదటి పేజీ తరువాయి)
దానివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని భావిస్తున్న ప్రభుత్వం.. శిశు విద్యను ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 210 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. 2025–26 విద్యా సంవత్సరానికి నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకోవాలని డీఈవోలకు సూచించింది. దీంతో ఎంపికచేసిన పలు పాఠశాలల్లో ఈ తరగతులు వెంటనే అమల్లోకి రానున్నాయి. దీంతో తల్లిదండ్రులకు కూడా భరోసా ఏర్పడనుంది.

## దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

(మొదటి పేజీ తరువాయి)
మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యచేశారు. ప్రకాశం జిల్లా పొదిలిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు, డ్యూటీలో ఉన్న పోలీసులపై వైసీపీ సైకోలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు.ఇప్పుడేమో తల్లిలా గౌరవించాల్సిన మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వారికి మద్దతుగా నిలుస్తున్నారంటూ మంత్రి లోకేష్ దుయ్యబట్టారు. జగన్ తన తల్లిని, చెల్లిని మెడపట్టి బయటకు గెంటేశారని, అలాగే వారిని కోర్టుకు ఈడ్చారని ఫైర్ అయ్యారు. సొంత చెల్లి పుట్టుకపై దుష్ప్రచారం చేయించిన మీరు మహిళలను గౌరవిస్తారని ఆశించడం అత్యాశలేనని లోకేష్ విమర్శించారు. మహిళలపై వైసీపీ నేతలు మాట్లాడుతున్న మాటలకు, పొదిలిలో మహిళలపై చేసిన దాడికి జగన్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు.

## ఏడాదిగా వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం

**అమరావతి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్‌ది చాలా కీలక పాత్ర.. పాలసీ మేకింగ్, వాగ్దానాల అమలు విషయంలో పవన్ కల్యాణ్ అన్నిటినీ సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నారు. కూటమిలో జనసేనకు ఎక్కువ బాధ్యత ఉంది.. ప్రజలకోసం కూటమికి జనసేన ఎప్పుడూ సహకరిస్తుందని జనసేన పీఏసీ చైర్మన్, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.. కూటమి ఏడాది పాలన పై మాట్లాడిన ఆయన.. అమరావతి, పోలవరం వంటి కీలక అంశాలపై దృష్టి సారించి అభివృద్ధిని కొనసాగిస్తున్నాం అన్నారు. సూపర్ 6 కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు మేం సవాల్ చేస్తున్నాం.. డిబేట్‌కు రెడీ.. ప్రభుత్వం పాలనలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పారదర్శకంగా టెక్నాలజీని ఉపయోగించి సంక్షేమాన్ని ప్రజలకు చేర్చుతున్నాం. వైసీపీ పాలన విచిత్రంగా, అనుభవం లేక, స్వలాభం కోసం వ్యవస్థను దుర్వినియోగం చేశారు. సంక్షేమం పేరుతో ప్రలోభాలు పలికారు.. పరిపాలనపై ఏనాడూ దృష్టి పెట్టలేదు.. వ్యవస్థకు అపార నష్టం కలిగింది.. కేంద్రం నుంచి 100 శాతం సహకారం అందుతోంది. గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువ అండగా కేంద్రం నిలబడుతుంది.. ప్రజలకు పథకాలు సరిగ్గా అందించామని గుర్తించి కేంద్రం సహకరిస్తోందన్నారు.

# పాఠశాలల పునః ప్రారంభోత్సవం పండగ వాతావరణంలాగ జరగాలి

■ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బుధవారం నాడు వికారాబాద్ కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి బడి బాట,ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పాఠశాలల పునః ప్రారంభోత్సవ సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జూమ్ ద్వారా పాఠశాలల్లోని ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల పునః ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య నోటు పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాఠశాల ఆవరణలో గదుల పైన నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.నీటి నిల్వలు ఉండటంతో దోమల ద్వారా డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని,విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో మరమ్మతు పనులు, కిచెన్ షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో ట్యాంకులను క్లోరినేషన్ చేసి త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకో వాలన్నారు.పాఠశాలల్లో బియ్యాన్ని పరిశీలించి నాణ్యతతో కూడిన బియ్యాన్ని మాత్రమే వాడుకోవాలని అధికారులకు సూచించారు. బియ్యంలో ఏదైనా లోపం ఉంటే తిరిగి ఇచ్చేసి మంచి బియ్యంను తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.




### బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలి: జిల్లా కలెక్టర్

బడి ఈడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులను అంగన్వాడిలో చేర్చుకోవాలని అదేవిధంగా ఆరు సంవత్సరాలు దాటిన పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.మండల విద్యాధికారులు పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా దానికి అనుగుణంగా విద్యా బోధన సాగే విధంగా,ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పాఠశాలలను సందర్శించి తనిఖీల నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, విద్యాశాఖ అధికారి రేణుకా దేవి,డిఆర్డిఓ శ్రీనివాస్,ఇంచార్జ్ డిడబ్ల్యూఓ జయసుధ,మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా కబీర్ దాస్ జయంతి వేడుకలు

**జడ్చర్ల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** స్థానిక డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హిందీ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ హిందీ కవి మరియు మధ్య యుగ సంఘ సంస్కర్త కబిర్ దాస్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జి. సుకన్య కబీర్ దాస్ చిత్ర పటానికి పుష్ప మాల వేసి, మాట్లాడుతూ.. కబిర్ దాస్ గొప్ప సామాజిక స్పృహ కల్గిన కవి అని,సామాజిక సమన్వయం, ధార్మిక సమరసత కు ఎంతో కృషి చేసిన కవి అని అన్నారు.కార్యక్రమ నిర్వాహకులు హిందీ శాఖ అధ్యక్షులు డాక్టర్.నరసింహ రావు,కల్యాణి, కబిర్ దాస్,వ్రాసిన బీజక్ గ్రంథం లోని విశేషాలను తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు డాక్టర్ నర్మదా దేవి మాట్లాడుతూ..కబీర్ రచనలను ఈనాటికి సమాజంలో నైతికతను మరియు సుహృద్భా వాన్ని కల్పిస్తాయని అన్నారు ఆయన వ్రాసిన చిన్న చిన్న దోహాల ద్వార అనేక మంచి విషయాలు తెలియజేశారు అని అన్నారు. అంతకుముందు చరిత్ర సహాయ ఆచార్యుడు రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..మధ్యయుగంలోని సామాజిక అసమానతలను తొలగించడంలో కబీర్ దాస్ కిలక పాత్ర వహించారని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ నర్సింలు డాక్టర్.వెంకటయ్య ,డాక్టర్. పుష్పలత,అలాగే రాజనీతి, శాస్త్ర అధ్యాపకులు నందకిషోర్ డాక్టర్.నందకిషోర్,తదితర అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






# ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభం...!

■ సాగు బాటలో రైతన్న



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా రూరల్ సిరికొండ మండలం కొండూరు గ్రామానికి చెందిన లింభారెడ్డి తన ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమిలో బుధవారం వరి నాట్లు ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లాలోని వరి నాట్లు వేయడం మొట్టమొదటిగా కొండూరు గ్రామంలోనే ప్రారంభించారు. వరి నాట్లు వేయడానికి వచ్చిన గ్రామ మహిళలు మరియు రైతు లింభారెడ్డి మాట్లాడుతూ..బిహార్, బెంగాలీ కూలీలు వరి పీకితే కాండం తెగిపోయి వారి నేల నుండి పెరిగి పచ్చబడడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది దిగుబడి తక్కువ వస్తుంది.వరి నాట్లు దూరం దూరం వేస్తారని వారు తెలిపారు.ఊరి మహిళలు వరి పీకితే కాండము తెగిపోదు వరి నాట్లు దగ్గరగా వేస్తారని నేల నుండి పైకి లేసి తొందరగా పచ్చబడుతుంది. దిగుబడి ఎక్కువగా వస్తుందని అన్నారు. ఒక్క ఎకరానికి వరి పీకి నాటు వేయడానికి ఎనిమిది మంది వేస్తారని తెలిపారు. ఒక్కరికి దినసరి కూలి 500 రూపాయలు వరి గుజులు వేయడానికి ఒక్క మగవారి కూలి రూ.1000/- రూపాయలు ఇస్తున్నానని రైతు లింబరెడ్డి తెలిపారు.గ్రామాలలో మహిళలు వరి నాట్లు వేసేవారు తక్కువ మంది ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో వరి నాట్లు వేయిస్తున్నారు.

# అమ్మమాట అంగన్వాడి బాట




**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అమ్మమాట అంగన్వాడి బాట అని అంగన్వాడి టీచర్ దుర్పతి బాయి పేర్కొన్నారు. గురువారం పోతంగల్ మండలంలోని చేతన్ నగర్ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో పిల్లల తల్లులు హాజ రై అమ్మబాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లలకు ఎగ్ బిర్యానీ చేసి తినిపించడంతో పిల్లలు చాలా సంతోషించారు.ఈ కార్యక్రమంలో ఆయమ్మ నవీన,తల్లులు సంగీత,లాలబాయి,గంగాసాగర్,కిషోర్ బాలికలు,పిల్లలు పాల్గొన్నారు.

# పిల్లలతో బలవంతం పనులు బాల్యం నాశనం

**నంద్యాల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపీఎస్ ఆదేశాల మేరకు,ఆళ్లగడ్డ ఎస్.డిపిఓ సూచనల మేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ శక్తి టీం మరియు చైల్డ్ లేబర్ ఆఫీసర్స్ తో కలిసి ఆళ్లగడ్డ లోని మెయిన్ రోడ్,కందుకూరు రోడ్డు,కోవెలకుంట్ల రోడ్డు మరియు నంద్యాల రోడ్డు ఏరియాలలో బట్టల షాపులు, మెకానిక్ షాపులలో చైల్డ్ లేబర్ గురించి తనిఖీలు చేయడం జరిగింది.బాల కార్మిక చట్టం అనేది పిల్లలను బలవంతంగా పని చేయించడం మరియు వారి బాల్యాన్ని నాశనం చేయకుండా రక్షించే ఒక చట్టం.ఈ చట్టం 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను పనిలో నియమించడాన్ని నిషేధిస్తుంది.14 సంవత్సరంలోపు పిల్లలను పని లో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరం,అలా పనిలో నియమించుకున్న వారు శిక్షర్హులు అవుతారని అవగాహన కల్పించారు.




# బసవన్న రాజసం..రైతన్న సంబరం





■ చౌడాపూర్ మండల కేంద్రంలో ఘనంగా ఎరువక పౌర్ణమి

■ ఎద్దులను ముస్తాబు చేసిన రైతులు

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో రైతులు ఎంతో ఉత్సాహంగా బుధవారం రోజు ఏరువాక పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించారు. పశువులకు స్నానాలు చేయించి రంగులను అంటించారు. ఎద్దులను సర్వంగ సుందరంగా ముస్తాబు చేసేందుకు అన్నదాతలు పోటీ పడ్డారు.వస్త్రాలతో అలంకరించి రంగురంగుల తాళ్లు,గంటలు, గజ్జెలతో అలంకరించారు. ఎద్దులకు కారింగులు,భక్షాలను ఎద్దులకు తినిపించారు.అలంకరించిన ఎద్దులను, ట్రాక్టర్లను బండ్లను సాయంత్రం రైతులు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గుడి చుట్టూ తిప్పారు.అక్కడ భారీ ఎత్తున ప్రజలు గ్రామస్తులు పాల్గొనడంతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం కానవచ్చింది.

# నేడు పెద్దేముల్ మండలానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి రాక



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నేడు (గురువారం)పెద్దేముల్ మండలానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రానున్నారు.పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 11 గంటలకు ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరు కానున్నారు.ఈ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పాటు తాండూరు డివిజన్ స్థాయి,మండల స్థాయి అధికారులు,ఆయా గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు,ఇందిరమ్మ కమిటీల సభ్యులు,ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు,మండల ప్రజా ప్రతినిధులు,ఆయా గ్రామాల ప్రజలు నాయకులు, ఇతర అధికారులు హాజరుకానున్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో కొత్తపల్లి గ్రామంలో బుధవారం జరిగినది కొత్తపల్లి ఫస్ట్ సెంటర్ సెకండ్ సెంటర్ ఇన్చార్జి పుష్ప ఆధ్వర్యంలో అమ్మ మాటఅంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మన ఇంట్లో తల్లులు చెబితే పిల్లలు వింటారు అదేవిధంగా అంగన్వాడి సెంటర్లో టీచర్లు బోధిస్తే ఆటపాటలు కూడా పిల్లలు వినాలని తెల్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వచ్చిందిహెచ్ఎం దస్తగిరి ఏఎన్ఎం పుష్ప,ఆశ వర్కర్లు,అంగన్వాడి టీచర్లు,అంగన్వాడి పిల్లల తల్లి తల్లులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్యకు సహకరిస్తాం..!

■ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ

**నంద్యాల,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు తమ సహకారం తప్పనిసరిగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ అన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ లో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని,జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం ఇస్తామని చెప్పారని ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ అన్నారు.రానున్న రోజుల్లో పాత్రికేయుల పిల్లలకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య పొందడం హక్కుగా భావిస్తున్నామన్నారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న రిపోర్టర్స్ క్షేమం కోసం ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ ముందుంటుందన్నారు. వార్తల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఐఆర్ఏ అండగా నిలుస్తుందని ఐఆర్ఏ జాతీయ కార్యదర్శి యలనాటి జాషువా అన్నారు. స్వేచ్ఛగా జీవించడంతో పాటు స్వేచ్ఛగా వార్తలు రాయడం కూడా ప్రాథమిక హక్కుగా భావిస్తున్నామన్నారు. అందుకే ఐఆర్ఏ అంటే విలేకరుల సంక్షేమానికి గుర్తుగా ఉంటుందన్నారు. అనంతరం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జై సూర్య పాత్రికేయులు తరఫున కలెక్టర్ ను పాత్రికేయులకు సహకరించవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలోఐఆర్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ బాబు,జిల్లా అధ్యక్షులు లెజెండ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# మండలంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి





■ గ్రామాల్లో కాడెడ్లను, ఎడ్లబండ్లను ముస్తాబు చేసిన రైతన్నలు

■ గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా కాడెడ్లను,ఎడ్లబండ్లను ట్రాక్టర్లను ఊరేగించిన రైతన్నలు

■ ఏరువాక పౌర్ణమిలో భాగంగా కాడెడ్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన రైతన్నలు

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం రైతులు గ్రామస్తులు ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఏరువాక పౌర్ణమి పండుగలో భాగంగా తమ వద్ద ఉన్న కాడెడ్లను,ఇతర పశువులను వివిధ రకాల రంగులతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఏరువాక పౌర్ణమి సందర్భంగా వాటికి పిండి వంటకాలు పెట్టి అన్ని విధాలుగా ముస్తాబు చేశారు.అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కాడెడ్లను, ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను ముస్తాబు చేసి ఊరేగించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతన్నలు నూతన దుక్కులను తమ కాడెడ్ల సహాయంతో ప్రత్యేక పూజలను చేసి ప్రారంభించారు. రైతులు ఏరువాక పౌర్ణమిలో భాగంగా తమ ఇండ్లలో పిండి వంటకాలు వండుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆనందంగా గుడుపుతూ సహాపంక్తి భోజనాలను ఆరగించి ఏరువాక పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

### ఏరువాక పౌర్ణమి పండుగ ప్రత్యేకత

వర్షఋతువులో జ్యేష్ఠశుద్ధ పౌర్ణమిని తెలుగు రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటారు. ముఖ్యంగా తొలకరి జల్లుల ఆగమనంతో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నటంతో పొలం పనులు మొదలుపెడతారు."ఏరు" అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభమనీ అంటే వ్యవసాయం మొదలుపెట్టడమని అర్థం. సాంప్రదాయికంగా రైతులు ఏరువాక పున్నమిని పండుగలా జరుపుకుంటారు.ఆ రోజు రైతులు తమ కాడెడ్లను కడిగి చక్కగా అలంకరిస్తారు.వాటికి పొంగలి పెడుతారు.అనంతరం రైతులందరూ సామూహికంగా కాడెడ్లను తోలుకుని పొలాలకు వెళ్లి దుక్కి దున్నుతారు. ఏరువాక పౌర్ణమి రోజున ఇంటి ఆడపడుచులు పుట్టింటికి వస్తారు.ఈ పండుగ రోజు చేసే మరో ముఖ్యమైన వేడుక ఎడ్ల పందేలు,కాడెడ్లను బాగా అలంకరించి పరిగెత్తిస్తారు.వాటి వెనుక యువకులు పరుగులు తీస్తారు.అంతేకాకుండా కాడెడ్లకు బండలు (బరువైన రాళ్ళు) కట్టి పరుగులు తీయిస్తారు.దీన్ని బండలాగుడు పోటీ అంటారు.ఏరువాక పౌర్ణమి రోజునే ఇళ్ళలో పనిచేసే జీతగాళ్ళ సంవత్సరం ముగిసి కొత్త సంవత్సరం మొదలవుతుంది.

## ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్,ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాలల్లో (06) అకౌంటెంట్,(03) ఏఎన్ఎం ఖాళీలను తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో మహిళా అభ్యర్థులు పనిచేయుటకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. కేజీబీవీ దోమ,కేజీబీవీ బషీరాబాద్, కేజీబీవీ కొట్పల్లి, కేజీబీవీ పెద్దేముల్, కేజీబీవీ చౌడపూర్ అలాగే కేజీబీవీ బోమ్రాస్ పేట్ నందు అకౌంటెంట్ పోస్టులు, కేజీబీవీ చౌడపూర్, కేజీబీవీ నవాబుపేట అదేవిధంగా ఆదర్శ పాఠశాల ముజాహిద్ పూర్ నందు ఏఎన్ఎం ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు.అకౌంటెంట్ కు గ్రాడ్యుయేషన్ ఇన్ కామర్స్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ (ఎంఎస్ వర్డ్ మరియు ఎక్సెల్) లేదా బీకాం కంప్యూటర్స్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. ఏఎన్ఎంకు ఇంటర్మీడియట్ తో పాటు ఏఎన్ఎం సర్టిఫికేట్ గవర్నమెంట్ రికగ్నైజ్డ్ ఇన్స్టిట్యూషన్స్ నుండి సర్టిఫికెట్ పొంది ఉండాలని అన్నారు. అకౌంటెంట్ కొరకు కామర్స్ డిగ్రీ చేసిన వారికీ 75 శాతం, పీజీ ఎం.కామ్ చేసిన వారికి 25 శాతం వెయిటేజి ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు.ఏఎన్ఎం కొరకు ఇంటర్మీడియట్, ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికేట్ వున్న వారికి 45 శాతం, ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ వున్న వారికి (జిఎన్ఎం ట్రైనింగ్-5 మార్కులు,బీఎస్సి నర్సింగ్ 10 మార్కులు) అదనపు వెయిటేజ్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు.25 నుండి 40 సంవత్సరంలోపు వయస్సు కలవారు అర్హులని ఆమె తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 12 నుండి 16 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డిఇఓ రేణుకాదేవి తెలిపారు.

## నూతన మంత్రిని కలిసిన నవాబ్ పేట్ మండల దళిత సంఘ నేతలు



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నూతన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల దళిత నాయకులు.. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి రాష్ట్ర నూతన మంత్రివర్గంలో చోటు దక్కడం పట్ల వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలం దళిత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నాడు నవాబ్ పేట్ మండల నాయకులు మంత్రి వివేక్ వెంకటస్వామి హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి పూల బోకే,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి వివేక్ వెంకట్ స్వామిని కలిసిన వారిలో నారేగూడ శివరాజ్,అడ్వకేట్ ఆనందం,మాజి సర్పంచ్ పర్మయ్య,మీనపల్లి అంజయ్య ,శ్యామయ్య, మాణిక్యం,రాజు,కర్ణకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత లోపంతో హంద్రీ నివా విస్తరణ పనులు

- కాంట్రాక్టర్ ప్రజల సొమ్ము
- కాంట్రాక్టర్ల వల్ల ప్రజల సొమ్మును దుర్వినియోగం

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అధికారుల పర్యవేక్షణ లేకుండా హంద్రీనీవా విస్తరణ పనులను కాంట్రాక్టర్ ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తున్నారు కాబట్టి ఉన్నత స్థాయి కమిటీ విచారణ చేపట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు బుధవారం నందికొట్కూరు మండలం మల్యాల హంద్రీనీవా నుండి జరుగుతున్న హంద్రీనీవా విస్తరణ పనులను సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం నాగేశ్వరరావు సిపిఎం నాయకులు పి పకీరు సాహెబ్,టి.గోపాలకృష్ణ తదితరులు కలిసి పనులను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ మల్లెల హంద్రి నీవ నుండి అనంతపురం వరకు జరుగుతున్న విస్తరణ పనులు సిపిఎం పార్టీ బృందం మల్యాల నుండి బ్రాహ్మణ కొట్టుకూరు వరకు పర్యటించి పనులను పరిశీలించడం జరిగిందని పనుల్లో నాణ్యత లేదని మెగా కంపెనీ కాంట్రాక్టర్ అవగాహన లేని, అనుభవం లేని అనేకమంది సబ్ కాంట్రాక్టర్లకు పనిని అప్పజెప్పి మెగా కంపెనీ చేతులు దులుపుకుందని వారు ఆరోపించారు. దీర్ఘకాలం ప్రజలకు, రైతాంగానికి సాగు, తాగు నీటికి ఉపయోగించాల్సిన హంద్రీనీవా నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది, కానీ నేడు హంద్రీనీవా పనుల దగ్గర ఈఈ,డిఈ ఉన్నత స్థాయి అధికారులు పనుల దగ్గర పర్యవేక్షణ లేకుండా క్రింది స్థాయి సిబ్బందిని పెట్టి పనిచేయడం మూలంగా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్యోగం చేసి కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు.గత వారం రోజులుగా సిపిఎం పార్టీ బృందం పనులను పర్యవేక్షించిందని ఈ సందర్భంగా ఉన్నత అధికారులు పనుల దగ్గర లేకపోవడం అధికారులు బాధ్యత రహితంగా ఉన్నారని వారు ఆరోపించారు. కావున జిల్లా కలెక్టర్ నీటిపారుదల శాఖ మంత్రి పర్యటన చేసి పనుల పైన సమగ్ర విచారణ చేపట్టాలని నాణ్యత లేకుండా పనులు చేస్తున్న సబ్ కాంట్రాక్టర్లను తొలగించి మెగా కంపెనీతో చేయించాలని, మెగా కంపెనీ చేయించలేకపోతే ప్రభుత్వమే బాధ్యత తీసుకొని పనులను చేయించాలని వారి డిమాండ్ చేశారు.



## పల్లె పండుగ తో మెరుగైన అభివృద్ధి





- ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- పాఠశాల విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం
- నందికొట్కూర్ ఎమ్మెల్యేగిత్త జయ సూర్య

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూటమి ప్రభుత్వం రాష్ట్రం మెరుగైన అభివృద్ధి చెందేందుకు నూతనంగా పల్లె పండుగ కార్యక్రమం చేపట్టడం జరిగింది. గత ప్రభుత్వం 15 ఆర్థిక సంఘం నిధులను గంటలోపే కాజేసిన దొంగ వైయస్ జగన్ అంటూ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం జూన్ 12 కు స,,చేసుకున్నందున పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నియోజవర్గంలోఅభివృద్ధి పనులకు భూమి పూజ,శంకుస్థాపన , ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు.నందికొట్కూర్ మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో నందికొట్కూర్ నుండి అల్లూరు మీదుగా వడ్డెమాన్ మరియు బ్రాహ్మణకొట్కూర్ వరకు నాబార్డ్ మరియు ఎస్.హెచ్ ప్లాన్ కింద ఐదు కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు,విస్తరణకు శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా పగిద్యాల మండల పరిధిలోని గ్రామపంచాయతీకి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ అభివృద్ధి పనులకు దాదాపు కోటి రూపాయలు చేసి మంజూరు చేసి పనులను నేడు ప్రారంభించడం సంతోషమన్నారు. జూపాడు బంగ్లా మండలంలో కస్తూరిబా గాంధీ జూనియర్ కళాశాలకు డార్మెంటరీ ఆరు అదనపు గదుల నిర్మాణం కోసం రెండు కోట్ల యాభై ఐదు లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు. పాములపాడు మండలంలోని తుమ్మలూరు గ్రామపంచాయతీ నందు అంబేద్కర్ విగ్రహం నుండి గ్రామ సచివాలయం వరకు 34.5 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మరి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో భోజనం అందిస్తామన్నారు. నియోజవర్గంలో వివిధ రోగాల బారిన పడి ఆర్థికంగా నష్టపోయిన పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దాదాపు కోటి 70 లక్షల రూపాయలకు సంబంధించిన చెక్కులను పార్టీలకు అతీతంగా బాధితుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు తెలిపారని ప్రజలకు గుర్తు చేశారు. పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని ఆయన అధికారులకు సూచించారు. నియోజవర్గంలో ఫ్యాక్షన్ వద్దు అభివృద్ధి ముద్దు అనే నినాదంతో గ్రామాల్లో అభివృద్ధి కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.గత ఎన్నికల ముందు జగన్ రూ 3వేలు పెన్షన్ ఇచ్చేందుకు సంవత్సరాలు పట్టిందని పెద్ద దద్దమ్మ జగన్ అన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజవర్గంలో టిడిపి జెండా ఎగరవేయాలని ,ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, తహశీల్దార్,లు శివ రాముడు, నాయక్, ఎంపీడీవోలు,చంద్రశేఖర్ సర్పంచులు, పిట్టల శేషమ్మ, వనమాల ప్రసాద్,మోతి బాలయ్య వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్లు పలుచాని మహేశ్వర్ రెడ్డి,గుండ్రెడ్డి రవీంద్రారెడ్డి, మోహన్ రెడ్డి,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐపీఎస్



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామంలో ఈ మధ్య కాలంలో మాజీద్ ఖాన్ మరియు వారి కుటుంబ సభ్యులపై పాత కక్షలు మనసులో పెట్టుకొని తాళ్ల నవీన్,టేకుమల్ల మనోజ్, గొల్ల అశోక్,సంఘముల నిఖిల్,వడ్లూరి రంజిత్ కుమార్,కటికే రమేష్ వీరందరూ కలిసి ముప్పేట దాడి చేయడం జరిగింది.ఈ దాడిలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేసి,ఇట్టి కేసు పై పక్కగా ఇన్వెస్టిగేషన్ చేసి,ఎవ్వరు ఈ చర్యకు కారకులో వారిని గుర్తించి రిమాండ్ చెయ్యడం జరిగింది. కావున నిజామాబాదు పోలీస్ కమీషనరెట్ పరిధిలో ఎవ్వరయిన భవిష్యత్తులో ఎలాంటి అల్లర్లకు / శాంతిభద్రతలకు విఘాతం కలిగించడానికి ప్రయత్నించిన వారిపై పూర్తి స్థాయి " నిఘా వ్యవస్థ" ఉంటుందని ప్రతీ ఒక్కరు తమ నడవడికను మార్చు కోవాలని,లేని యెడల వారి పై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎవ్వరికైనా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించడం లేదా సమాజంలో ఉద్రిక్తతలను రేపే విధంగా వ్యవహారించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్ హెచ్చరించడం జరిగింది. పోలీస్ శాఖాపరంగా శాంతియుత వాతావారణం కొరకై నిర్విరామంగా కృషి జరుగుతుందని, ప్రజల సహాకారం అత్యంత ప్రధానమైనదని తెలియజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారం ఎవ్వరికైనా తెలిసిన మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని లేదా ఈ దిగువ తెలియజేసిన 100, స్పెషల్ బ్రాంచ్ నంబర్ 8712659777 పోలీస్ కంట్రోల్ రూమ్ 0846226090 ఫోన్ నెంబర్లకు తెలియజేయగలరు. సమాచారం ఇచ్చిన పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలియజేశారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 2011- 2012బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నవాబుపేట్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2011 2012లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు.పూర్వ విద్యార్థులు కలుసుకుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు.ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తదితరులు మాట్లాడుతూ, అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.13 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. నవాబుపేట్ హైస్కూల్లో 2011-2012 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు ఎం.ఆంజనేలు, వంశీ, రమేష్ ,నరేందర్, ఎస్.రాజు ,ఎం.రాజు,మమతా,జ్యోతి,భార్గవి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఈగల ద్వారా 15 రకాల జబ్బులు
- కలుస్తమైన నీటి ద్వారా నాలుగు రకాల జబ్బులు
- దోమల ద్వారా 8 రకాల జబ్బులు
- జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో తుకారాం రాథోడ్



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో తుకారం రాథోడ్ సూచించారు.మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ సెక్రటరీలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా తుకారం రాథోడ్ మరియు సిరికొండ ప్రభుత్వ ఆసుపత్రి అధికారి అరవింద్,మండల స్పెషల్ ఆఫీసర్ నాగొరావు ,ఎంపీడీవో కేఆర్ మనోహర్ రెడ్డి,ఎంపీఓ తారాచంద్ తదితరులు పంచాయతీ సెక్రెటరీ లకు తగు జాగ్రత్తలు సూచనలు చేశారు.అనంతరం తుకారాం రాథోడ్ మాట్లాడుతూ..వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎన్ని రకాలు వస్తాయి, ఏ విధంగా వస్తాయి, అనేది సెక్రటరీలకు వివరించారు. ఈగల వల్ల 15 రకాల జబ్బులు వస్తాయి కలుషితమైన నీటి వల్ల నాలుగు రకాల జబ్బులు దోమల వల్ల ఎనిమిది రకాల జబ్బులు వస్తాయని వివరించారు. గత సంవత్సరం జిల్లాలో 700 పైగా డెంగ్యూ వ్యాధి కేసులు నమోదయ్యాయి సిరికొండ మండలంలో 84 డెంగ్యూ కేసులు వచ్చాయని అన్నారు. పంచాయతీ సెక్రటరీలు గ్రామాలలో తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. మురికి నీరు నిలవకుండా చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పారేయకుండా చూడాలని సెక్రటరీలకు సూచించారు. దోమ చిన్నదే కానీ ప్రాణాంతకరమైన వ్యాధిని ప్రభజింపజేస్తుందని అన్నారు. మురికి కాలువలు ఇండ్లలో నీటితోటీలు ప్లాస్టిక్ పాడుబట్ల ఇండ్లలో నీటి నిల్వలు ఉంచరాదని తెలిపారు. అలాగే కూలర్ లో నీటిని ఉంచరాదు అలా ఉంచడం వల్ల దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడతారని తెలిపారు.వారానికి ఒకసారి నీటి నిల్వలను తీసేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని అన్నారు.

Prinited, Published and owned by Rathod Vinod Kumar , Printed At SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town, Hyderabad Road, Sangareddy District, Telangana State 502220, Editor : Rathod Vinod kumar, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491, 8341021491, Email: expresstelugudaily@gmail.com